పర్యటించి.. పాఠాలు బోధించి..


సోనాపూర్‌లో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న పాలనాధికారి కుమార్ దీపక్

వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని పాలనాధికారి కుమార్ దీపక్ ఉపాధ్యాయులను ఉద్దేశించి అన్నారు. కాసిపేట మండలంలోని సోనాపూర్, నాయికపుగూడెం పాఠశాలలను తనిఖీ చేసి, విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. స్వయంగా విద్యార్థులకు పాఠాలను బోధించారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనంపై అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. గట్రావ్‌పల్లి పంచాయతీలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం మండలంలోని కాసిపేట సబ్ సెంటర్, పీహెచ్‌సీ సెంటర్‌ను తనిఖీ చేపట్టారు. రోజువారీగా ఎంత మందికి రక్త పరీక్షలు చేస్తున్నారో ల్యాబ్ టెక్నిషన్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. - న్యూస్‌టుడే, కాసిపేట

ప్రజలతో మమేకమై పని చేయాలి: సీపీ

తాండూరు, భీమిని న్యూస్‌టుడే: పోలీసు సిబ్బంది ప్రజలు, యువతీయువకులతో మమేకమై పని చేయాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తాండూరు, మాదారం, కన్నెపల్లి, భీమిని పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆయా పోలీస్‌స్టేషన్లలోని కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సామాజిక మాధ్యమాలపై దృష్టిసారించి హద్దులు దాటి ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే కమిషనరేట్‌లో సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పని తీరుపై నిరంతరం నిఘా ఉంచాలని పోలీసులకు సూచించారు. భీమిని పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉందని త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. సీఐ కుమారస్వామి, ఎస్సైలు కిరణ్‌కుమార్, సౌజన్య, గంగారాం, విజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

స్థలం కొనేముందు.. అప్రమత్తతే మందు



నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని ఇటీవల నస్పూర్‌కు చెందిన దీకొండ అన్నయ్యకు చెందిన ఇంటిని ఒక సర్వే నంబరులో భూమి కొని మరో సర్వే నంబరులో నిర్మించారనే కారణంతో మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. అయితే నిబంధనల ప్రకారమే ఇంటి నిర్మాణం చేపట్టానని బాధితుడి ఆరోపణ. భూమి కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉంటే ఇలా జరిగి ఉండేది కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన హరినాయక్ కు భూమి పట్టాదారుల ఫోర్జరీ సంతకాలతో పట్టా చేయించుకున్నాడని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే పట్టాదారు సంతకాలతో కొన్నేళ్ల క్రితమే పట్టా జరిగిందని హరినాయక్ వాదన. సరైన జాగ్రత్తలు పాటిస్తే బాగుండేదని అధికారులు సూచిస్తున్నారు. పైన పేర్కొన్నవి ఒక్క జిల్లాలోనే కాదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇలాంటి ఘటనలు ఇటీవల తరచూ చోటు చేసుకుంటున్నాయి.

దండేపల్లి గ్రామీణం, లక్షెట్టిపేట, న్యూస్‌టుడే

స్థలం కొనుగోలు చేసేప్పుడు సరైన జాగ్రత్తలు పాటించకపోవడం, పత్రాలు సరిగ్గా చూసుకోకపోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. అధికారులు తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీంతో పాటు స్థలాన్ని నష్టపోయే అవకాశాలున్నాయి. ఇటీవల రాజధానిలో హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను కూల్చివేస్తోంది. జిల్లాల్లోనూ ప్రజల్లో భూముల కొనుగోళ్లపై సవాలక్ష అనుమానాలు తలెత్తుతున్నాయి. భూమి కొనుగోలు చేసేటప్పుడు వాటి పత్రాలు, రిజిస్ట్రేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పట్టా అయిన తర్వాత దాన్ని కాపాడుకునే విధానాలపై విశ్రాంత కలెక్టర్ శర్మన్‌నాయక్, సబ్‌రిజిస్ట్రార్ సూచనలు, సలహాలు ఇచ్చారు.




జీపీఎస్ మ్యాప్ కెమెరాతో ఇట్టే తెలుసుకోవచ్చు

ఇక్కడ కనిపిస్తున్న చిత్రం జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్ ద్వారా చిత్రీకరించింది. మనం కొనుగోలు చేసిన ప్రదేశాన్ని గుర్తించడానికి ఇది తోడ్పడుతుంది. భూమి వద్దకు వెళ్లి ఫొటో తీయడం ద్వారా మనం ఉన్న ప్రదేశం అక్షాంశాలు, రేఖాంశాలు, సర్వే నెంబరు, లేదా ప్లాటు నెంబరు మనకు కనిపిస్తుంది. దాన్ని చిత్రీకరించడం ద్వారా ఫొటోపై వివరాలు నమోదవుతాయి.

ప్రభుత్వ స్థలమా, పట్టానా చూసుకోవాలి



- భూమి కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వ స్థలమా, పట్టానా అనేది మొదట చూసుకోవాలి.
- తహసీల్దార్ కార్యాలయంలో కొనుగోలు భూమికి సంబంధించిన రికార్డులు, పహాణీలను సరి చూడాలి.
- భూమి విక్రయించే వ్యక్తిపైనే పట్టా ఉందా, మనం కొనుగోలు చేసే భూమి అతడికి సంబంధించినదేనా అనేది పరిశీలించాలి.
- కొనుగోలు చేసిన భూమి, పట్టా భూమి ఒకటేనా అనే దానిపై సర్వే నంబర్లను పోల్చి చూడాలి.
- మొదటగా 15 ఏళ్ల క్రితం పహణీలు, విక్రయదారునికి భూమి ఎలా వచ్చింది, వారసత్వమా, కొనుగోలా వంటివి జాగ్రత్తగా చూసుకోవాలి.
- కొనుగోలు తర్వాత హద్దురాళ్లు ఏర్పాటు చేసుకోవాలి.

శర్మన్‌నాయక్ విశ్రాంత కలెక్టర్

కొనుగోలు సమయంలో సరిచూసుకోవాలి



- భూమి క్రయ, విక్రయాల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కొనుగోలుదారుడిదే.
- లింకు డాక్యుమెంట్లు లేకుండా భూమి కొనుగోలు చేయడం సరికాదు.
- భూమి కొనుగోలు చేసే సమయంలో సర్వే నెంబరు, లొకేషన్, హద్దులు కచ్చితంగా చూసుకోవాలి.
- భూమికి నాలుగువైపులా ఉన్న యజమానులను విచారించడం ద్వారా మోసపోకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది.
- కొనుగోలు చేసే ముందు ఇ.సి.ద్వారా భూమిపై లావాదేవీలు తెలుసుకోవచ్చు.
- ఓపెన్ ప్లాట్లకు డీటీసీపీ అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలి. ఇంటి రిజిస్ట్రేషన్ సమయంలో నిర్మాణ అనుమతి పత్రం, బీఎస్‌ఎస్ నుంచి అనుమతులు తీసుకున్న పత్రం సరిచూసుకోవాలి.
- చెరువు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భూమి ఉందా తెలుసుకోవడానికి నీటిపారుదలశాఖ, రెవెన్యూ శాఖల ద్వారా వివరాలు పొందవచ్చు.
- డబుల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్లు ఆధారంగా సరి చూసుకునే వెసులుబాటు ఉంది.
- తాజాగా ఐజీఆర్ఎస్-తెలంగాణ పోర్టల్ ద్వారా భూమి స్వభావాన్ని తెలుసుకునే వీలు ప్రభుత్వం కల్పించింది.

జి.సాయికుమార్, సబ్ రిజిస్ట్రార్, లక్షెట్టిపేట

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి యువకుడి మృతి


బత్తుల మధుకర్

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దండేపల్లి మండలం కొత్తకొమ్ముగూడ గ్రామానికి చెందిన బత్తుల మధుకర్(26) అనే యువకుడు ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 18న మధుకర్‌కు జ్వరం రావడంతో అదే ఊరిలోని దండేపల్లి మండలం కన్నెపల్లిలో ఆర్‌ఎంపీగా పని చేస్తున్న బొడ్డు శ్రీనివాస్‌ను సంప్రదించారు. రెండు ఇంజక్షన్‌లు ఇచ్చి ఒక సెలైన్ బాటిల్ పెడతానని చెప్పి అందులో మూడు ఇంజక్షన్‌లు కలిపి పెట్టి ఊళ్లోకి వెళ్లాడు. కాసేపటి తర్వాత తీవ్రమైన చలితో జ్వరం అధికమై వాంతులు, విరోచనాలయ్యాయి. కంగారుపడిన బంధువులు శ్రీనివాస్‌ను పిలిపించగా ఇంజక్షన్‌లో ఏదో తప్పు జరిగిందని మంచిర్యాల ఆసుపత్రికి తీసుకువెళ్లమని చెప్పాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెదడులో సమస్య వచ్చిందని, వేరే ఆసుపత్రికి వెళ్లాలని సూచించగా కరీంనగర్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి వైద్యులు మూడు రోజులు చికిత్స చేసి బ్రెయిన్‌డెడ్ అయిందని తీసుకువెళ్లమని చెప్పారు. ఎలాగైనా బతికించుకోవాలని మళ్లీ మంచిర్యాల ఆసుపత్రికి తరలించి వెంటిలేటర్‌పై ఉంచగా మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి బత్తుల రాజలింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బంధువుల రాస్తారోకో

లక్షెట్టిపేట: బత్తుల మధుకర్ బంధువులు మంగళవారం లక్షెట్టిపేటలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మధుకర్ మృతికి కారణమైన ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పట్టణంలో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వారిని సముదాయించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వగా రాస్తారోకో విరమింపజేశారు.


లక్షెట్టిపేటలో రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబీకులు

సిబ్బంది చేతివాటం.. రుణాలకు సంకటం

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం స్త్రీనిధి రుణాలు ప్రారంభించింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా వందకు 92 పైసల వడ్డీతో రూ.25 వేల నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు అందిస్తున్నారు. గతంలో రుణాలు ఇవ్వడంలో, వసూలు చేయడంలో ముందు వరుసలో ఉన్న జిల్లా పంపిణీలో వెనకబడిపోయింది. క్షేత్రస్థాయిలో సిబ్బంది చేతివాటం, పర్యవేక్షణకు సరైన అధికార యంత్రాంగం లేకపోవడంతో అతివల ఆర్థిక వృద్ధికి విఘాతం కలుగుతోంది.

రూ.32 కోట్ల బకాయిలు..

దక్కని రుణాలు

సభ్యులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా చరవాణి ద్వారా దరఖాస్తు చేస్తే గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు సభ్యురాలి బ్యాంకు ఖాతాలో పది నుంచి పదిహేను రోజుల్లో రుణాలు మంజూరు చేస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో నెలలు గడిచినా రుణాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 26 మంది జనరల్ మేనేజర్లకు బదులు నలుగురితో నెట్టుకొస్తున్నారు. వీరి ఒక్కొక్కరికి నాలుగైదు మండలాలు, మున్సిపాలిటీలు ఉండగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరవైంది. పని ఒత్తిడి కారణంగా జనరల్ మేనేజర్లు విధుల్లో నుంచి తప్పుకొంటున్నా నియామకాలు చేపట్టడం లేదు. జిల్లాలో ప్రస్తుతం రూ.32 కోట్ల బకాయిలు ఉండగా కొత్త రుణాలు మంజూరు కావడం లేదు. ప్రధానంగా సెర్ప్, మెప్మా పరిధిలోని ఆర్పీలు, వీఏవోలు ఖాతాదారులు నెలవారీగా చెల్లించిన డబ్బులను సొంతానికి వాడుకుని బ్యాంకులలో చెల్లించడం లేదు. నెలవారీ రుణాల మొత్తాలను ఏ నెలకు ఆ నెలలో జమ చేయాల్సి ఉండగా మూడు, నాలుగు నెలలు ఆలస్యం చేస్తున్నారు. ఇది కొత్త రుణాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

క్యాతనపల్లి మున్సిపాలిటీకి చెందిన ఒక రిసోర్స్‌పర్సన్(ఆర్‌పీ) రూ.10 లక్షలు సొంతానికి వాడుకున్నాడు. రుణాల అసలుతోపాటు వడ్డీ చెల్లించకపోవడంతో సంబంధిత సభ్యులకు తిరిగి రుణాలు వచ్చే వీలు లేకుండా పోతోంది.

మంచిర్యాల మున్సిపాలిటీలో ఒక ఆర్‌పీ సభ్యుల రుణాలకు సంబంధించిన రూ.8 లక్షలు బ్యాంకులో చెల్లించలేదు.

ఇటీవల నిర్మల్ జిల్లాలో ఆర్పీలు స్త్రీనిధి రుణాలలో అక్రమాలకు పాల్పడగా పోలీసులు ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారు. ఈ తరహా మంచిర్యాల జిల్లాలో ఉన్నప్పటికీ అధికారయంత్రాంగం పట్టించుకోవడం లేదు.



జిల్లాలో గ్రామ సమాఖ్యలు: 701

స్వయం సహాయక సంఘాలు: 16,670

నమోదైన సభ్యులు: 1,76,000

జిల్లాలో మూడు సంవత్సరాలుగా పంపిణీ ఇలా..

	లక్ష్యం (రూ.కోట్లలో)	ఇచ్చింది (రూ.కోట్లలో)	శాతం
2022-23	126.00	78.61	62
2023-24	47.66	52.94	111.08
2024-25	70.55	19.84	28.13


మహిళా సంఘాల సభ్యుల సమావేశం



ఆసుపత్రిదారి.. నరకప్రాయం

దండేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి ఇది. దండేపల్లిలోని పాత తహసీల్దార్ కార్యాలయం నుంచి సుమారు 300 మీటర్ల దూరంలో ఉన్న ఆరోగ్య కేంద్రం వరకు గతంలో సీసీ రహదారి నిర్మించారు. చాలా పేద కుటుంబాలు నివసించే ఈ ప్రాంతంలో మురుగు కాల్వలు లేవు. ఉన్న సీసీ రహదారి శిథిలమై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారే లేరు. దారి శిథిలమై పగుళ్లు తేలడంతో నడక నరకప్రాయంగా మారింది. నిత్యం ఆసుపత్రికి ఇదే దారిగుండా వచ్చే పలువురు రోగులు ఇబ్బంది పడుతున్నారు.

-న్యూస్‌టుడే, దండేపల్లి

అన్ని మండలాలకు విద్యాధికారులు

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: పలు మండలాలకు ఒక్కరే ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన తీరుకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్వస్తి పలికింది. నోడల్ అధికారులుగా ఉన్న సీనియర్ హెచ్‌ఎంలకే మండల విద్యాధికారులుగా అదనపు బాధ్యతలు ఇస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టినట్లయింది. ప్రభుత్వ నిర్ణయంతో 19 సంవత్సరాల తర్వాత సమస్యకు పరిష్కారం లభించింది. జిల్లాలోని 18 మండలాలకు ఏడుగురు పీజీహెచ్‌ఎంలు మండల విద్యాధికారులుగా కొనసాగుతున్నారు. దీంతో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చేది. ప్రస్తుతం అన్ని మండలాలకు స్థానికంగా విధులు నిర్వర్తించే పీజీహెచ్‌ఎంలకే ఇన్‌ఛార్జి మండల విద్యాధికారులుగా కేటాయించడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మెరుగుపడి విద్యావ్యవస్థ గాడిలోపడే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

నూతన ఇన్‌ఛార్జి ఎంఈవోలు వీరే..

మండలం	ఎంఈవో
మందమర్రి	ఎన్. శ్రీనివాస్
చెన్నూరు	కె. రాధాకృష్ణమూర్తి
వేమనపల్లి	బి. శ్రీధర్‌రెడ్డి
జన్నారం	ఎన్. విజయ్‌కుమార్
భీమిని	ఎన్. కృష్ణమూర్తి
తాండూరు	ఎస్. మల్లేశం
లక్షెట్టిపేట	కె. హెలెన్‌దోరతి
మంచిర్యాల	వీఎస్‌వీ మాలవిదేవి
జైపూర్	బి. శ్రీనివాస్
కోటపల్లి	కె. వెంకటేశ్వర్లు
కన్నెపల్లి	ఎస్. రాము
కాసిపేట	ఎం. వెంకటేశ్వరస్వామి
దండేపల్లి	దుర్గం చిన్నయ్య
నస్పూర్	కె. రామన్న
హాజీపూర్	పి. తిరుపతిరెడ్డి
భీమారం	కె. సురేష్
నెన్నెల	పి. చంద్రశేఖర్‌రెడ్డి
బెల్లంపల్లి	జె. పోచయ్య

ఆకట్టుకున్న యోగా పోటీలు

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి లిటిల్‌ఫ్లవర్ పాఠశాల ఆవరణలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సీహెచ్ ఫణిరాజ్, యోగా కన్వీనర్ కనకయ్య ప్రారంభించారు. 150 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ కనబర్చిన వారిని జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కల్పన, తిరుపతిరెడ్డి, కుమార్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



నిర్వాహకులు, అతిథులతో విజేతలు

పిల్లల ఉద్యానవనాలపై చిన్నచూపు


ఏఎంసీ పిల్లల ఉద్యానవనంలో పెరిగిన గడ్డి

బెల్లంపల్లిలో పిల్లల పార్కులపై సింగరేణి యాజమాన్యం చిన్నచూపు చూస్తుంది. ఇక్కడ పిల్లల కోసం రెండు పార్కులను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణను గాలికి వదిలేసింది. తిలక్ క్రీడామైదానంలో ఆట పరికరాలు వృథాగా ఉంటున్నాయి. చుట్టూ గడ్డి పెరిగింది. దీంతో పిల్లలు ఇక్కడికి రావడమే మానేశారు. ఏఎంసీ మైదానంలో ఆట పరికరాలు ఉన్నచోట గడ్డి లేనప్పటికీ మిగతా స్థలంలో గడ్డి పెరిగింది. దీంతో అడపాదడపా పిల్లలు వెళ్తున్నారు. సింగరేణి యాజమాన్యం ఇప్పటికైనా పిల్లల ఉద్యానవనాల నిర్వహణ బాధ్యతను తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, బెల్లంపల్లి పట్టణం


తిలక్ క్రీడా మైదానంలోని పిల్లల ఉద్యానవనంలో ఆట పరికరాల పరిస్థితి

సహకార సంఘాలకు నోటీసుల దడ

● పెనుభారంగా ఆదాయపు పన్ను.. జీఎస్టీ




న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లావాదేవీలు, క్రయవిక్రయాలు తదితర వాటిపై ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసులు రావడంతో సంఘాలు కంగుతిన్నాయి. ఇప్పుడిప్పుడే ఎరువులు, విత్తనాల విక్రయాలతోపాటు, రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ, ఆదాయాన్ని సమకూర్చుకుంటూ.. నిలదొక్కుకుంటున్న సంఘాలకు ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు రావడంతో సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. క్రయవిక్రయాలపై వచ్చే ఆదాయంపై పన్ను చెల్లించాలని ఐటీ, సంఘాలు నిర్వహించే సేవా రంగాలు, వ్యాపార లావాదేవీలకు జీఎస్టీ నోటీసులు రావడంతో సంఘాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో వివిధ సహకార సంఘాలకు రూ. 5లక్షలనుంచి రూ. కోటి వరకు చెల్లించాలని ఈ నోటీసుల్లో పేర్కొనడంతో సంఘాలు విస్తుపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని 77 సహకార సంఘాలు రైతుల కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. గతంలో సంఘాలు కేవలం పంట రుణాల తదితర వాటికి పరిమితం కావడం, బినామీ పేరుతో చాలా మంది రుణాలు తీసుకోవడంతో సంఘాలు నష్టాల్లో కూరుకుపోయాయి. ఇప్పటికీ 20కి పైగా సంఘాలు నామమాత్రంగానే ఉన్నాయి. కొన్ని సంఘాలు ఎరువులు, విత్తనాలు విక్రయించడం, రైతుల నుంచి కమీషన్‌తో పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం, పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు నిర్వహించి, ఆదాయాన్ని పెంచుకొని నిలదొక్కుకుంటున్నాయి. కొన్ని సంఘాలు రైతుల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు చేసే డిపాజిట్లు, తీసుకునే వడ్డీ పైనా పన్ను చెల్లించాలని ఆదాయ పన్ను శాఖ నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసులపై స్పందించిన సహకార సంఘాలు కమిషనర్‌ను కలిసి రైతుల సేవలకు సంబంధించిన లావాదేవీలపై ఆదాయ పన్ను మినహాయించాలని వినతిపత్రం ఇచ్చినట్లు సహకార సంఘం అధ్యక్షుడు పండరి తెలిపారు.

జీఎస్టీ పరిధిలోకి..

వాణిజ్య పన్నుల శాఖ గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండేది. అప్పుడు సంఘాలు నిర్వహించే వాటిపై పన్ను ఉండేది కాదు. 2017 జులై 1 నుంచి వాణిజ్య పన్నుల శాఖ పరిధిలోని పన్నుల వసూళ్లు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని జీఎస్టీ కిందకు వెళ్లాయి. ఎరువుల విక్రయాలపై 5 శాతం, పురుగు మందుల విక్రయాలపై 18 శాతం పన్నును సంఘాలు జీఎస్టీ రూపంలో చెల్లించాల్సి వస్తోంది. గతంలో మాదిరిగానే సంఘాలు ఆదాయ వ్యయాలకు సంబంధించి లెక్కలు చూపించడం లేదు. 2017 నుంచి 2021 వరకు సంవత్సరం వారీగా ఆదాయ వ్యయ వివరాలను తెలియజేయాలంటూ నోటీసులు రావడంతో సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జీఎస్టీ నోటీసుల నేపథ్యంలో సహకార సంఘాలు చార్టెడ్ అకౌంటెంట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొని సంవత్సరం వారీగా ఆదాయ, వ్యయ లెక్కలు అప్పజెప్పే పనిలో ఉన్నాయి.

జిల్లాల వారీగా సహకార సంఘాలు

జిల్లా	ఆదిలాబాద్	నిర్మల్	మంచిర్యాల	కుమురంభీం
సంఘాలు	28	17	20	12
సభ్యులు	59,493	46,928	47,474	23,788

అవగాహన కల్పించి.. స్వచ్ఛతకు నడుం బిగించి..


మందమర్రిలో మరుగుదొడ్డిని శుభ్రం చేస్తున్న పుర అధికారులు

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మందమర్రి యాపల్‌లో సామూహిక మరుగుదొడ్లను పుర కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది కృష్ణప్రసాద్, శ్యాంసుందర్, సమీర్, పున్నం చందర్, రాజశేఖర్, గోపికృష్ణ, రఘురాం, శిరీష్, శ్యాంబాబు తదితరులు శుభ్రం చేశారు. ఇల్లు, కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ సంచులను నిషేధించాలని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు.

కొంగ తెల్లన.. తల నల్లన



పంట పొలాల్లో గడ్డి కోసం పశువులు, గింజల కోసం పక్షులు రావడం సహజం. కానీ ఇక్కడ గింజలు లేవు పచ్చని పచ్చిక మాత్రమే ఉంది. మరి పచ్చికలో ఈ పక్షులకు పనేంటి అనుకుంటున్నారా.. సారంగాపూర్ మండలం చించోలి గ్రామ శివారులోని పంట పొలంలో కనిపించిన తెల్లని శరీరం, నల్లని తల కలిగిన ఈ పక్షులను ఇబిస్ కొంగలు అంటారు. వీటి శాస్త్రీయ నామం త్రిస్ కిరోనిస్ మెలనో సెఫాలస్. దేశమంతటా తిరుగుతూ పచ్చని, తడి నేల ప్రాంతాల్లో క్రిమి కీటకాలు, మట్టిలోని చిన్న చిన్న పురుగులను ఆహారంగా తీసుకుంటాయని ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్ వెల్మల మధు తెలిపారు.

- చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్

'యూబిట్ కాయిన్' వ్యవహారంలో పోలీసుల అదుపులో ఉపాధ్యాయుడు

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : బోథ్ మండలం సొనాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని యూబిట్ కాయిన్ వ్యవహారంలో నిర్మల్ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే నిర్మల్ జిల్లా పోలీసులు సొనాలలోని రామాలయం కాలనీలో రెక్కీ నిర్వహించారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. సదరు ఉపాధ్యాయుడు యూబిట్ కాయిన్ వ్యవహారంలో సభ్యులను ఈ వ్యాపారంలో చేర్చుతూ స్టార్ రేటింగ్ పొందినట్లు సమాచారం. సొనాల, బోథ్ చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు నిర్మల్ జిల్లాలోని పలు మండలాల్లోని తన బంధువులను ఈ వ్యవహారంలోకి లాగి రూ.లక్షల్లో నగదును పెట్టుబడిగా పెట్టించినట్లు సమాచారం. పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే విషయం తెలియడంతో ఈ వ్యాపారంలో పెట్టుబడి పెట్టిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు.



విద్యార్థులకు ఉచిత శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించాలి

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని బంగారుగూడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇన్సినరేటర్ యంత్రం, శానిటరీ ప్యాడ్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. లెర్నింగ్ కర్వ్, భారత్ పెట్రోలియం కెమికల్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా జిల్లాలోని 18 కస్తూర్బాలకు ఉచితంగా ఇన్సినరేటర్ యంత్రాలు(శానిటరీ ప్యాడ్లను కాల్చివేసే యంత్రం), ఏడాదికి సరిపడా శానిటరీ ప్యాడ్లను విద్యార్థులకు అందించారు. వాటిని జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇన్సినరేటర్ ఉపయోగాలను విద్యార్థులకు వివరించి పర్యావరణ పరిరక్షణలో దాని పాత్రను తెలిపారు. విద్యార్థులు కౌమార దశలో ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దన్నారు. అనంతరం విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. డీఈవో ప్రణీత, కేజీబీవీల సంయుక్త అధికారి ఉదయశ్రీ, లెర్నింగ్, బీపీసీఎల్ సంస్థ ప్రతినిధులు స్వప్న, మోనిష్‌రెడ్డి, నాగరాజు, ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆ గడియారం ఆగదు

కబీర్‌దాస్ మాటలు గుర్తు చేసుకుంటే..



'రేపు చేయాల్సిన పని ఈ రోజే చేయి. ఈ రోజు చేయాల్సిన పనిని ఇప్పుడే చేసేయి..' అని సంత్ కబీర్‌దాస్ చెప్పిన మాట ఇప్పటికీ గుర్తు చేసుకుంటూ ఉంటే 'కాలం' ఎంత విలువైందో కదా..

అందరికీ అంతే కదా..

జీవితంలో ఏదైనా సాధించాలంటే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెబుతారు. సక్సెస్ సాధించిన వారి గురించి వివరిస్తూ ఎవరికైనా 24 గంటల సమయమే ఉంటుంది.. దాన్ని ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకుంటే విజయం సాధిస్తారని యువతను, విద్యార్థులను ఉద్దేశించి చెబుతారు.

నెపోలియన్

గాఢంగా నిద్రపోతున్నప్పుడు సైన్యాధిపతి వచ్చి 'శత్రుసైన్యం దక్షిణ దిక్కునుంచి చొచ్చుకొస్తోందని' చెబుతాడు. చటుక్కున నిద్రలేచి 'అవునా' అయితే ఆ గోడ మీద రాసిన 64వ నంబరు పద్ధతిలో శత్రువుల్ని ఎదుర్కోండి' అని అప్రమత్తం చేస్తాడు. ఏ సమయంలో ఎలా వ్యవహరించాలో ముందుగానే ప్రణాళిక చేసుకుంటే కాలం కలిసి స్పందనేందుకు ఇది సరిపోదా..

విజయం వెనక సమయం



మాది నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం బీరవెల్లి. వ్యవసాయ నేపథ్యమున్న అమ్మానాన్నలు కష్టపడి నన్ను చదివించారు. ఒక సాధారణ కుటుంబం నుంచి నేను ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇప్పుడు ఉస్మానియాలో పీజీ(గైనకాలజీ) చేస్తున్నానంటే దాని వెనక ఎంతో ప్రణాళిక ఉంది. ఎక్కడా సమయం వృథాచేయలేదు. వృత్తిలోనూ నాడి పట్టడం, తక్షణ చికిత్స అందించాల్సిన పరిస్థితుల్లో సమయమే ప్రధానం.

-డా.రమాదేవి

రోగిని పరీక్షిస్తున్న డా.రమాదేవి

● ఎవరికైనా సమయం 24 గంటలే

అదును దాటితే చీడతో పీడనే..

ఏ సమయంలో చేయాల్సిన పని ఆ సమయంలోనే చేయాలంటారు. ఇది రైతన్న విషయంలోనూ చాలా కీలకమే. విత్తనాలు వేయడం మొదలు కొని కలుపు తీయడం, ఎరువులు, మందులు చల్లడం వంటివి సమయానుకూలంగా చేయకపోతే చీడపీడలు నష్టం కలిగిస్తాయి.



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

నిమిషం నిబంధన తెలుసుగా..

ఆ టైమ్ ఏమయింది ఓ గంట అటూఇటూ అని తేలిగ్గా కొట్టిపారేస్తే కుదరదండోయ్. గంట కాదు నిమిషం కూడా ఎంత కీలకమో 60 సెకన్లు ఆలస్యంగా వెళ్లి వెనుదిరిగి పోటీ పరీక్ష రాయలేకపోయిన అభ్యర్థులను అడిగి చూడండి సమయం విలువ ఏంటో చెబుతారు.

కానీ గడియారం ముల్లు గుచ్చుకుంటోంది..



నిర్మల్‌కు చెందిన మడిపల్లి దక్షిణామూర్తి రేడియో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు. వివిధ సందర్భాల్లో పలు అంశాలపై ఆయన మాట్లాడుతున్నప్పుడు 'ఈ విషయంపై మరింత లోతుగా.. వివరంగా చెప్పాలని ఉంది కానీ మా స్టూడియోలోని గడియారం ముల్లు నన్ను గుచ్చుకుంటోంది..' అంటూ నవ్వుతూనే తనకిచ్చిన సమయం పూర్తవుతోందని చెబుతుంటారు.

-మడిపల్లి దక్షిణామూర్తి


జీవితంలో ప్రతీది సమయంతో సంబంధమున్నదే. రోజూ అన్నీ దాదాపు గడియారంకేసి చూస్తూ చేసే పనులే. ఏయ్ తెల్లారింది బడికి టైం అవుతుందని అమ్మ పిల్లల్ని నిద్రలేపడం. . ఏమోయ్ నేను ఆఫీసుకి గంట ముందే వెళ్లాలి త్వరగా టిఫిన్ చేసేయ్ అని భర్త చెప్పడం.. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి పంపించరని విద్యార్థులు ముందుగానే అప్రమత్తమయ్యేవన్నీ చూస్తూనే ఉంటాం. అంతెందుకు ఏ సమయంలో పుట్టాడు.. ఎప్పుడు మరణించాడు అనే ప్రశ్నలకూ 'టైమే' కదా సమాధానం.

-న్యూస్‌టుడే, మామడ



'తమ్ముడూ టైం అవుతోంది పదా'.. బడికెళ్లే ముందు సమయం చూసుకుంటున్న నిర్మల్‌కు చెందిన చిన్నారులు మనోమయి, మోక్షిత్

ఈ అలారమే నిద్రలేపేది..



'ఈ అలారం గడియారాన్ని నేను 1990లో కొనుగోలు చేశాను. విద్యార్థి దశలో నన్ను ఉదయాల్లో నిద్రలేపింది. ఉద్యోగంలో చేరాక ప్రయాణాలు చేయాల్సి వస్తే అది మోగించిన శబ్దమే దూరంగా ఉన్న గమ్యాన్ని సకాలంలో చేరేలా చేసింది. అందుకే ఇప్పటికీ ఇంట్లో భద్రంగా ఉంచాను..' దిల్లీలోని కెనడా రాయబార కార్యాలయంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఖానాపూర్‌కు చెందిన టి.సంపత్‌కుమార్ అలారంతో ఉన్న అనుబంధాన్ని వివరించారు.



నిర్మల్‌లో ఉన్న అమ్మానాన్నలు గంగాసాగర్ రెడ్డి-అరుణ కుమారుడితో మాట్లాడుతున్నప్పుడు రాత్రి 8.20 (వెనక గోడ గడియారంలో)

ఫోన్ చేయాలన్నా టైం చూసుకోవాల్సిందే..


సాధారణంగా మనకు ఉదయం పూట ఎవరైనా ఫోన్ చేస్తే గుడ్ మార్నింగ్ అంటుంటాం. కానీ పొద్దున్నే కాల్ వచ్చిన అన్ని సార్లు శుభోదయం చెప్పడం కుదరదు. విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి చాలా మంది విదేశాల్లో ఉంటున్నారు. వాళ్ల స్వదేశంలో ఉండే తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడాలంటే తప్పకుండా 'టైం' చూసుకుంటారు. రెండు దేశాల టైంజోన్ వేర్వేరుగా ఉంటుంది. మన సమయానుకూలంగా అక్కడ ఉన్న వాళ్లకు ఫోన్ చేస్తే వాళ్లు రాత్రి గాఢ నిద్రలో ఉంటారు.



న్యూయార్క్‌లో ఉన్న ప్రశాంత్‌రెడ్డి ఫోన్‌లో తల్లిదండ్రులతో మాట్లాడుతుండగా సమయం ఉదయం 10.49 (కంప్యూటర్ తెరపై)

అలిసిపోని గడియారం..

గడియారం రోజంతా పనిచేస్తూనే ఉంటుంది. కాసేపటికే అలసి పోయామనుకునే వారు వాచీ చూసి ఉత్తేజం తెచ్చుకోవచ్చు..



గంటల ముల్లు రోజులో రెండు సార్లు చుట్టూ తిరుగుతుంది..	నిమిషాల ముల్లు 24 సార్లు	సెకండ్ల ముల్లు 1440 సార్లు

సత్వర సేవల్లో బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్ భేష్

● రాష్ట్రంలో మూడో స్థానం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలకు సత్వర సేవలు అందించినందుకు రాష్ట్రవ్యాప్తంగా పది పోలీస్ స్టేషన్లను ఎంపిక చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఎస్‌హెచ్‌ఓ దేవయ్యతోపాటు ఇతర సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించారు. వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించడం, పోలీసుల పట్ల నమ్మకం కలిగేలా చేయడం, ప్రజలకు సత్వర సేవలు అందించడాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సత్వర సేవల్లో మూడో స్థానం కేటాయించారు. ఈ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని సీపీ శ్రీనివాస్, ఐజీ ప్రత్యేకంగా అభినందించారు.



బెల్లంపల్లిలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్

త్వరలో సీఎంతో గిరిజన, ముస్లిం నేతల సమావేశం

● మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న సీతక్క, చిత్రంలో షబ్బీర్ అలీ, వెడ్మ బొజ్జు, తదితరులు

ఈనాడు, హైదరాబాద్ : కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజనులు, ముస్లింల మధ్య శాంతియుత సంబంధాలను పునరుద్ధరించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కోరారు. జైనూర్‌కు చెందిన ముస్లిం, గిరిజన నేతలతో మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మంత్రి సీతక్కతో కలిసి మాట్లాడారు. ఈ నెల 4న చెలరేగిన మతపరమైన అల్లర్ల సమస్యను పరిష్కరించడంపై చర్చించారు. రెండు వర్గాల మధ్య సామరస్యం చెక్కుచెదరకుండా చూసుకోవాలన్నారు. ఈ నెల 28 లేదా 29న సీఎం రేవంత్‌రెడ్డితో గిరిజన, ముస్లిం నేతలతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ఇరువర్గాలు తమ విభేదాలను పరిష్కరించుకుని, శాంతియుత సంబంధాలను పునరుద్ధరించుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న ఇరువర్గాల నాయకులు తమ మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. ఒకరి సంప్రదాయాలు, గుర్తింపును మరొకరు గౌరవించుకోవడానికి అంగీకరించారు. ఇటీవల ఉట్నూర్, జైనూర్‌లోని గోండు ఆదివాసీ నాయకులతో సమావేశమైన మంత్రి అక్కడి అంశాలను ఈ సమావేశంలో వివరించారు. మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గిరిజన నేతలతో ఇటీవల సమావేశమైన అనంతరం వివాదానికి గల కారణాలు, శాంతిభద్రతల పునరుద్ధరణకు చేపట్టిన చర్యలను వివరిస్తూ ముఖ్యమంత్రికి తాజాగా నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, విద్యావేత్త మహబూబ్ ఆలంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

63వ జాతీయ రహదారి విస్తరణకు నిధులు మంజూరు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీని మంగళవారం దిల్లీలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలు కలిశారు. చెన్నూరు నియోజకవర్గానికి సంబంధించి పలు రహదారులపై మంత్రితో చర్చించారు. 63వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చెన్నూరు-భీమారం మండలాల సరిహద్దున జోడువాగు వద్ద రోడ్డు విస్తరణకు రూ.100 కోట్లను మంత్రి మంజూరు చేసినట్లు వారు పేర్కొన్నారు. కోటపల్లి మండలంలోని నక్కలపల్లి వాగుపైన వంతెన నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. జోడువాగుల వద్ద రోడ్డు మరమ్మతులకు ఇదివరకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.1.80 కోట్లు మంజూరుచేసినట్లు వారు చెప్పారు.



దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



విద్యార్థులతో ఏకలవ్య మోడల్ గురుకులం ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లి ఏకలవ్య మోడల్ గురుకుల విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సౌరభ్ యాదవ్ తెలిపారు. మంగళవారం పిట్టబొంగరం పంచాయతీ పాటగూడలోని ఏకలవ్య మోడల్ గురుకులంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. లక్షెట్టిపేటలోని మహాత్మా జ్యోతిబాపులే పాఠశాలలో సోమవారం జరిగిన అండర్-19 కుస్తీ పోటీల్లో పదోతరగతి విద్యార్థి పవన్, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి రాథోడ్ సాయికిరణ్ ప్రతిభ కనబరిచారు. వైస్ ప్రిన్సిపల్ రేఖారాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29న చదరంగం..

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న అండర్-15 ఏళ్ల విభాగం బాలబాలికల ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి నన్నపు స్వామి, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆసక్తి ఉన్న క్రీడాకారులు చరవాణి 98487 36476, 62819 66588 నెంబర్లను సంప్రదించి తమ పేర్లను ఈ నెల 28లోపు నమోదు చేసుకోవాలని సూచించారు.



విద్యార్థినులకు పురస్కారం అందజేస్తున్న ప్రిన్సిపల్ హరిత

కేయూ క్రీడాపోటీలలో విద్యార్థినుల ప్రతిభ

ఉట్నూరు: కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన గురుకుల విద్యార్థినుల క్రీడా పోటీలలో ఉట్నూరు గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ హరిత తెలిపారు. చెస్‌లో విద్యార్థినులు మల్లేశ్వరి, ద్రుపత, రాశికళ, జ్యోతిలు మొదటి స్థానాన్ని సాధించి సత్తాచాటారు. పరుగు పందెంలో లక్ష్మి, భీంబాయి, లావణ్య, ప్రియాంక, అనిత రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పీడీ మంగ, అధ్యాపకులు, సిబ్బంది వారిని అభినందించారు.

విధుల నిర్లక్ష్యం.. వికటిస్తున్న లక్ష్యం

● పోలీసుల్లో పెరుగుతున్న ఆశ్రిత పక్షపాతం



ఈటీవీ - ఆదిలాబాద్ : పోలీసంటే? న్యాయం, ధర్మం, బాధితుల పక్షం వహించే పవిత్రమైన విధి నిర్వహించేవారు. కానీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొంతమంది అధికారుల ఆశ్రిత పక్షపాత వైఖరి ఆ శాఖకే మచ్చ తెచ్చేలా మారుతోంది. రాజకీయ అండదండలు కలిగిన కొందరు పోలీసుల వ్యవహారం ఉన్నతాధికారులకే సవాలు విసిరేలా మారుతోంది. ఇటీవల ఓ అధికారి తన అధికార దర్పంతో బినామీలను ముందుంచి రూ.కోట్లు విలువ చేసే స్థిరాస్తి దందా, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు, పెట్రోల్ బంక్‌ల నిర్వహణలో తలదూర్చిన వివాదం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిన విషయం విదితమే. ఆయనతోపాటు తాజాగా మరో అధికారి పాత్రపై ఉన్నతాధికారులు అంతర్గతంగా ఆరా తీశారు. సంబంధంలేని విషయాల్లో కొందరు తలదూర్చటంతో అపవాదును మూటగట్టుకోవాల్సి వస్తోంది.

ఆదిలాబాద్ అక్రమాలు

ఆదిలాబాద్ జిల్లా బోథ్ సర్కిల్ పరిధిలో విధుల నిర్వహణ పట్టుతప్పుతోంది. నిబంధనలకు విరుద్ధంగా జరిగే స్థిరాస్తి వ్యాపారులకు, అంతరాష్ట్ర పరిధిలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు మీదుగా సాగే రాకపోకలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. జూద స్థావరాల నిర్వహణ, అక్రమంగా జరిగే గుట్కా విక్రయాల్లో కొందరి పాత్ర ఉన్నట్లు అధికారుల దృష్టికి వెళ్లింది. అలాంటి ఫిర్యాదులపైనే తాజాగా ఇచ్చోడ ఎస్‌ఐని ఆదిలాబాద్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు వెలువరించారు.

నిర్మల్ - తేదీ తారుమారు

నిర్మల్ డివిజన్‌లో కొందరి విధి నిర్వహణ ఇష్టారాజ్యంగా సాగుతున్నట్లు బయటపడింది. నిర్మల్ గ్రామీణ మండలంలో మూడు నెలల కిందట కారు - ద్విచక్ర వాహన ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు కారుకు బీమా లేదు. అప్పుడు కేసు నమోదు చేయలేదు. కారుకు బీమా చేశాక తేదీలు తారుమారు చేసి ప్రమాదం జరిగినట్లు చూపారు. సారంగాపూర్‌లో అనవసర విషయాల్లో తలదూర్చారనే మరో ఆరోపణ తోడవటంతో ఓ ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటుపడింది.

మంచిర్యాల - రాజకీయం

మంచిర్యాల జిల్లాలో నాలుగు నెలల కిందటి ఘటన పోలీసుల మధ్య సమన్వయలోపాన్ని బహిర్గతం చేసింది. విధుల్లో సరిగా స్పందించలేదనే కారణంపై ఓ ఎస్‌ఐని బాధ్యతల నుంచి తప్పించడంతోనే సరిపెట్టారే కానీ దాని వెనుక అసలైన వారెవరనేది గుర్తించలేదు. మంచిర్యాలలో ఓపార్టీ ద్వితీయ శ్రేణి నాయకుడిపై ఏడెనిమిది మంది యువకులు దాడి చేసి గాయపర్చటం వెనుక మరో పార్టీ నాయకుల హస్తం ఉందని ప్రచారం జరిగింది. కేసులోని ప్రాధాన్యతను గుర్తించకుండా పోలీసులు మామూలుగా వదిలేశారనే ఆరోపణపై ఓ ఎస్‌ఐను విధుల నుంచి తప్పించి రామగుండం కమిషనరేట్‌కు అటాచ్ చేశారు.

ఆదివాసీ కోటలో

ఆదివాసీకోట ఆసిఫాబాద్‌లో కొంత మంది అధికారుల పాత్ర విమర్శలకు తావిచ్చేలా మారుతోంది. బాధితుల పక్షాన కాకుండా భయభ్రాంతులకు గురిచేసే వారినే వెనకేసుకొస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ఇటీవల కాగజ్‌నగర్ డివిజన్‌లో ఓ సీఐని విధుల నుంచి తప్పించగా, తాజాగా ఆసిఫాబాద్‌లో డీఎస్పీని తప్పించిన విషయం విదితమే. సమస్యలు ఉత్పన్నమైనప్పుడే అప్రమత్తం కావటం తప్పితే అసలు కారణాలు ఆరా తీయడం లేదనే విమర్శలకు తావిస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం

? మందమర్రి రామన్‌కాలనీ వద్ద రైల్వేమార్గంపై నిర్మించిన వంతెనపై వీధి దీపాలు లేక చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.
- విద్యాసాగర్, రెండోజోన్

✔ తాత్కాలికంగా రెండు దీపాలు ఏర్పాటు చేశాం. శాశ్వత వీధి దీపాల కోసం ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూస్తాం.

? మందమర్రి పాతబస్టాండ్‌లోని జాతీయ రహదారి, కోల్‌బెల్ట్ రహదారిపై పశువుల సంచారం ఎక్కువగా ఉంది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. **- మాయ రమేష్, ఇంటర్‌నెట్ నిర్వాహకుడు**

✔ పశువుల యజమానులతో ఇప్పటికే మాట్లాడాం. మరోసారి ప్రకటన ఇచ్చిన తర్వాత చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

పైన పేర్కొన్న రెండు సమస్యలకు మందమర్రి పురపాలిక కమిషనర్ వెంకటేశ్వర్లు సమాధానం ఇచ్చారు.

పంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభమెప్పుడో?

హాజీపూర్ మండలం బుద్ధిపల్లిలో రూ. 20 లక్షల ఉపాధి హామీ నిధులతో పంచాయతీ కార్యాలయ భవనం నిర్మించారు. ఆరునెలల క్రితమే



పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. సర్పంచి పదవీ కాలం ముగుస్తుందనగా కార్యాలయాన్ని ప్రారంభించాలని చూసినప్పటికీ గ్రామ రాజకీయాల కారణంగా నిలిచిపోయింది. ఆ భవనం ఆరు నెలలుగా నిరుపయోగంగానే ఉంటోంది. అధికారులు గ్రామంలోని ఓ ఇరుకు గదిలోనే పంచాయతీ కార్యాలయ నిర్వహణను కొనసాగిస్తున్నారు. కానీ నూతన పంచాయతీ భవనం ప్రారంభించకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- హాజీపూర్, న్యూస్‌టుడే:

గుంపులుగా శునకాల సంచారం..

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చెన్నూరులో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో రాకపోకలు సాగిస్తున్న వారిపై వెంటపడి తరుముతున్నాయి. పాత బస్టాండ్, లైన్‌గడ్డ, కొత్త బస్టాండ్, అస్నాద్‌రోడ్డు, కొత్తగూడెం కాలనీ, విశ్వకర్మవీధి, మంగళిబజార్, గెర్రెకాలనీ, తదితర ప్రాంతాల్లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉంది. రహదారుల వెంట గుంపులు..గుంపులుగా ఉండటంతో వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు.. రాత్రివేళల్లో కుక్కల అరుపులతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.. వీటి సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో అవసరనిమిత్తం బయటికి వెళ్లేందుకు చేతిలో కర్రలు పట్టుకొని వెళ్తున్నారు.



పాతబస్టాండ్ ప్రాంతంలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

ఇది శ్మశానవాటికే..

కాసిపేట మండలంలోని ధర్మారావుపేట పంచాయతీలో ఏర్పాటు చేసిన శ్మశానవాటిక పిచ్చిమొక్కలతో నిండిపోయింది. మంగళవారం గ్రామానికి చెందిన ఓ యువకుడు మృతి చెందడంతో దహన సంస్కారాలకు వెళ్లగా ముళ్లపొదలు ఉండటంతో పక్కనే దహన సంస్కారాలను పూర్తి చేశారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నిర్మాణాలపై పర్యవేక్షణ లేకపోవడంతో అలంకారప్రాయంగా మారుతున్నాయి. వీటిపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కాసిపేట**



స్పందించి.. చెత్తను తొలగించి

వందనం

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: క్యాతనపల్లి పురపరిధిలోని స్థానిక 20వ వార్డులోని లెనిన్ నగర్‌లో కాలువలో పూడిక తీసి చెత్తను తొలగించ లేదు. మంగళవారం 'మేమున్నాం..మీకు తోడుగా'లో సమస్య ప్రచురితంకాగా పుర అధికారులు స్పందించారు. మంగళవారం ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ ఆదేశంతో సిబ్బంది చెత్తను తొలగించారు.



బెదిరింపు రాజకీయాలకు బెదరం

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రతిపక్ష పార్టీల నాయకులను బెదిరించే తరహాలో మాట్లాడితే బెదరమని భాజపా జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రఘునాథ్ మాట్లాడుతూ గతంలో భారాస హయాంలో భూఆక్రమణలు చేసిన వారు ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారని, వారిపై ముందుగా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని కాప్రాలో పేదల భూముల ఆక్రమణపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. పోలీసు అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులకు వత్తాసు పలుకకుండా బాధితుల పక్షాన నిలవాలన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డీజీపీ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, పంగులపల్లి వెంకటేశ్వర్‌రావు, మోటపలుకుల తిరుపతి, కర్రె లచ్చన్న, అమీరిశెట్టి రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

భీమారం : పార్టీ సభ్యత్వ నమోదు భారీ సంఖ్యలో జరిగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని భాజపా జిల్లా అధ్యక్షులు వెర్రబెల్లి రఘునాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆవుడం చౌరస్తా వద్ద నిర్వహించి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలాధ్యక్షుడు బోర్లకుంట శంకర్, ప్రధాన కార్యదర్శులు మాడెం శ్రీనివాస్, రాజేష్‌యాదవ్, ఆవిడపు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాల నియోజకవర్గంలో ఎవరు దాడులకు, అక్రమాలకు పాల్పడుతున్నారో తనపై, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. శాసనసభ ఎన్నికలు అయిన ఎనిమిది నెలల్లో ప్రేమ్‌సాగర్‌రావు అనేక మందిపై దాడులు చేయిస్తూ భయబ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా నాలుగుసార్లు నీతీ నిజాయితీగా పని చేశానని తెలిపారు. మంచిర్యాలలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'గతంలో తన తండ్రి పేరు మీద 57 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని అసత్య ఆరోపణలు చేశారు. ఆ భూమి కబ్జా చేసిన వ్యక్తి ఇప్పుడు నీ పార్టీలో, నీ పక్కనే కుర్చున్నారు. ఆ భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వానికి అప్పగించాలి. మంచిర్యాలలో నువ్వు ఇల్లు కట్టుకున్న స్థలాన్ని గతంలో సింగిల్ విండో ఛైర్మన్ హన్మంతరావును మోసం చేసి ఎలా తీసుకున్నావో ప్రజలకు తెలుసు. తాను ప్రజల ఇళ్లను కాపాడుతూ వస్తుంటే, ఆయన కూల్చేస్తున్నారు. నస్పూర్‌లో ఐబీలో ఉన్న కాసం నాయకుడు అన్యాయంగా అయిదు అంతస్తుల భవనాన్ని అన్యాయంగా కూల్చారు' అని అన్నారు. ఒక వేళ ప్రభుత్వ భూమిలో ఇల్లు కట్టుకున్నట్లు తప్పు జరిగితే ఆ భూమికి సంబంధించిన ధరను ప్రభుత్వానికి అతడితో కట్టించాలే తప్ప, కూల్చివేయడం సరికాదన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు రాజీవ్‌నగర్‌లో ప్రభుత్వపరంగా వేల మంది నిరుపేదలకు ఇళ్లు కట్టించినట్టు తెలిపారు. మార్కెట్ రోడ్డు రహదారి పక్కన చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని జీవనం సాగించే చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించి వారి కుటుంబాలు వీధిన పడగొట్టాలని ఇప్పుడున్న ఎమ్మెల్యే చూస్తున్నారని ఆరోపించారు. భూదాన యజ్ఞబోర్డు భూమి, రెడ్ క్రాస్ సొసైటీ అనాథ ఆశ్రమాలు నిర్మించిన ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా తాను కాపాడినట్లు తెలిపారు. ప్రేమ్‌సాగర్ రావు అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెల్లలో చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. తనపై తన కుమారుడు విజిత్‌పై తప్పుడు ప్రచారాలు చేయవద్దని కోరారు. తమ పార్టీ నాయకులపై దాడులు ఆపి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేష్, భారాస పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, రవీందర్‌రెడ్డి, శ్రీపతి శ్రీనివాస్, తోట తిరుపతి, మోగిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాలలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

నెన్నెల, న్యూస్‌టుడే: మండలంలోని మైలారం గ్రామం నుంచి అక్రమంగా బొలెరో వాహనంలో నాలుగు ఆవులు, నాలుగు ఎద్దులను తరలిస్తుండగా జోగాపూర్ బోర్డు వద్ద పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. పశుసంవర్ధకశాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా, ఓవర్‌లోడుతో మైలారం నుంచి కన్నెపల్లి మండలం ముత్తాపూర్‌కు తరలిస్తున్నారన్నారు. డ్రైవర్, క్లీనర్‌పై కేసు నమోదు చేసి వాహనంను సీజ్ చేసినట్లు చెప్పారు. పశువులను గోసంరక్షణ కేంద్రానికి తరలించామని చెప్పారు. డ్రైవర్ గాటి కొప్పుల నాగరాజు, మహ్మద్ ఇస్మాయిల్, క్లీనర్, మరో వ్యక్తి మహ్మద్ రసీత్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

వివాదాస్పదంగా కుక్కల చంపివేత ఘటన

చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలను కొందరు వ్యక్తులు పదునైన ఆయుధంతో చంపివేసిన ఘటన మంగళవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడం స్థానికంగా వివాదాస్పదంగా మారింది. పురపాలక సంఘ కార్యాలయంలో సఫాయి కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్న బాపు ఈ ఘటనకు పాల్పడినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైన వీడియోలో ఒప్పుకున్నాడు. అయితే కుక్కలను ఎందుకు హతమార్చావని అతడిని ఎదుటి వ్యక్తి ప్రశ్నించగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ అర్చనగిల్డా భర్త రాంలాల్‌గిల్డా సూచన మేరకు చంపానని పేర్కొన్నాడు. పట్టణంలో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందని వాటిని చంపివేయాలని రాంలాల్‌గిల్డా తనకు చెప్పడంతో మూడు రోజుల క్రితం అయిదు కుక్కలను తన వద్ద ఉన్న బరిసెతో చంపానని చెప్పాడు. రాత్రి ఇద్దరు మిత్రులతో కలిసి ఆటోలో వెళ్లి గాంధీచౌక్, పెద్దచెరువు రావిచెట్టు ప్రాంతాల్లో కుక్కలను చంపినట్లు అతడు ఒప్పుకున్నాడు. ఓ వైపు ఇదంతా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుండగానే ఛైర్‌పర్సన్ భర్త రాంలాల్‌గిల్డా తనకు కుక్కలను చంపమని చెప్పలేదని, తనకున్న పంది పిల్లలను కుక్కలు చంపగా వాటిపై కోపంతో తానే రెండు కుక్కలను చంపివేశానని, పోలీసులు సీసీపుటేజీ ఆధారంగా ఇటీవల తనను నిలదీస్తే భయపడి ఛైర్‌పర్సన్ భర్త పేరు చెప్పానని సఫాయి కార్మికుడు పేర్కొన్న మరో వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రసారం అయింది.

ఇరువర్గాల దాడులు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్‌లో సోమవారం అర్ధరాత్రి ఇరువర్గాలకు చెందిన యువకులు పాతకక్షలతో పరస్పరం దాడులు చేసుకున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. పట్టణానికి చెందిన స్థిరాస్తి వ్యాపారి జగన్‌మోహన్‌రావు ఇంటిపై స్థానికులైన రుద్రతేజ, జ్ఞానేశ్వర్‌తోపాటు మరో పది మంది కత్తులు, కర్రలతో దాడి చేశారు. జగన్‌మోహన్‌రావు వద్ద పనిచేసే మెర సంజీవ్‌తోపాటు వాచ్‌మెన్‌లను కొట్టగా వారు తీవ్రంగా గాయపడ్డారు. సంజీవ్, వాచ్‌మెన్‌లు తిరగబడి ప్రతిఘటించే క్రమంలో రుద్రతేజ, జ్ఞానేశ్వర్‌లకు సైతం గాయాలయ్యాయి. ప్రస్తుతం గాయాలపాలైన వారు పలు ఆసుపత్రులలో ఉన్నట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. గడిచిన సంవత్సరంలో గొడవ జరిగిన ఇంట్లో దాడులు జరగడం ఇది రెండవసారి.

అంత్యక్రియలు అడ్డగింత

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి పట్టణ శివారులో భూవివాదం కారణంగా కొంత సమయం అంత్యక్రియలు నిలిచిపోవడం చర్చనీయాంశమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బురదగూడెం గ్రామంలో నేతకాని కులానికి చెందిన శ్రీనివాస్(30) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు మంగళవారం జరిపించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శవయాత్ర పూర్తి చేసి అంత్యక్రియలు జరిపే చోటుకు వెళ్లారు. ఈ క్రమంలో ఈ స్థలం తమదంటూ కొందరు గౌడ కుల సంఘం సభ్యులు అడ్డుకోవడం వివాదానికి దారి తీసింది. ఈ విషయం తెలిసిన వెంటనే మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, తహసీల్దార్ సతీష్‌లు అక్కడి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. భూ వివాదం రెండు, మూడు రోజుల్లో పరిష్కారానికి కృషి చేస్తామని నచ్చజెప్పారు. అనంతరం శ్రీనివాస్ అంత్యక్రియలు పూర్తి చేశారు.

అక్టోబరు 3 నుంచి సార్వత్రిక పరీక్షలు

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: అక్టోబరు 3 నుంచి 9వ వరకు తెలంగాణ పది ఇంటర్ సార్వత్రిక పరీక్షలను నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతాయన్నారు. ఇందుకోసం జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి జనరల్, వొకేషన్ కోర్సులకు అక్టోబరు 16 నుంచి 23 వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయన్నారు.

దండేపల్లి: వచ్చే నెల 3 నుంచి జరగనున్న సార్వత్రిక పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాసే అభ్యాసకులు ఈ నెల 26లోగా తత్కాల్ ద్వారా పరీక్ష రుసుం చెల్లించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని స్థానిక అధ్యయన కేంద్రం సమన్వయకర్త బీసగోని శంకర్‌గౌడ్, సహాయ సమన్వయకర్త సంగర్స్ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు.

'బెల్లంపల్లిలో రౌడీయిజం హద్దులు మీరుతుంది'

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి పట్టణంలో రౌడీయిజం హద్దులు మీరుతుందని మాజీ కౌన్సిలర్ పొట్ల సురేష్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల పాలిటెక్నిక్ కళాశాలలోకి గంజాయి బ్యాచ్ వెళ్లి విద్యార్థులను పరిగెత్తించుకుంటూ తీవ్రంగా కొట్టారన్నారు. బెల్లంపల్లిలో కబ్జాలు పెరిగిపోయాయని చెప్పారు. కన్నాలబస్తీలో బస్తీ గ్రంథాలయం స్థలం కబ్జా అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పోలీసులు రౌడీలకు వత్తాసు పలుకుతున్నట్లు పరిస్థితులను చూస్తే అర్థమవుతుందని ఆరోపించారు. భారాస నుంచి వచ్చిన నాయకులే ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను అబాసుపాలు చేస్తున్నారన్నారు. కబ్జాలు, గంజాయి బ్యాచ్ వ్యవహారంపై ఆధారాలతో సీఎం దృష్టికి త్వరలో తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అమనుల్లాఖాన్, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు అన్వర్‌ఖాన్, టీపీసీసీ సోషల్ మీడియా ప్రతినిధి దేవసాని ఆనంద్, తెదేపా పట్టణ కార్యదర్శి నామసాని సత్యనారాయణ పాల్గొన్నారు.



తాళ్లపేటలో మహిళలకు బతుకమ్మ చీరలు అందిస్తున్న ఎమ్మెల్యే సోదరీమణులు, నాయకులు

దసరా కానుకగా చీరల పంపిణీ

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ కొనసాగుతుందని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారని, ఇది కొనసాగుతుందని ట్రైకార్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి, ఎమ్మెల్యే సోదరీమణులు రుక్మిణీ, సత్యశ్రీ అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో దసరా కానుకగా దండేపల్లి మండలం తాళ్లపేట, మాలకుపేట, రాజుగూడ, నాగసముద్రం, లింగాపూర్, గుడిరేవు, అల్లీపూర్, మామిడిపల్లి, మేదరిపేట గ్రామాల్లో మంగళవారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

ఏసీసీ, న్యూస్‌టుడే: బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నీటి మోటార్ల సమస్యలను పరిష్కరించి నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించి నివేదికలు అందించాలన్నారు. బెల్లంపల్లి పురపాలికకు మంజూరైన 91 అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు.

బెల్లంపల్లి గ్రామీణం : శిథిలావస్థలోని ప్రభుత్వ బడుల్లో అదనపు గదుల నిర్మాణాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. చర్లపల్లి, కన్నెపల్లి మండలం చర్లపల్లి, పట్టనంలోని రాంనగర్ పాఠశాలలను పరిశీలించారు. శిథిలావస్థల్లో ఉన్న రాంనగర్, బెల్లంపల్లి మండలం చర్లపల్లి పాఠశాలలకు అదనపు గదుల నిర్మాణానికి రూ.8 లక్షలు కేటాయించినట్లు తెలిపారు.

ఈ నెలాఖరులోగా ఇంటింటా సర్వే పూర్తి

ఏసీసీ, న్యూస్‌టుడే: ఓటరు జాబితా సంక్షిప్త సవరణను పక్కాగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ అధికారి సి.సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. నూతన ఓటర్ల నమోదు, మార్పు చేర్పులకు, తొలగింపులకు ఇంటింటి సర్వేను నెలాఖరులోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మెరుగైన వైద్య సేవలకు కృషి: ఎమ్మెల్యే

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మసీ, డయాలసిస్ కేంద్రంతోపాటు ఇతర వార్డులను సందర్శించారు. రోగులకు వైద్యపరంగా ఇబ్బందులు లేకుండా చూడాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్‌ను ఆదేశించారు. కౌన్సిలర్ ప్రభాకర్, నాయకులు రమేష్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

తాండూరును అభివృద్ధి చేస్తా

తాండూరు: మండల పరిధిలోని సమస్యలన్నింటినీ పరిష్కరించి అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 35 కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. మండల పరిధిలో రూ.6.65 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మండల ప్రజలకు ఎల్లంపల్లి నుంచి తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీ భవనం, కుమురంభీం విగ్రహ ఏర్పాటుకు స్థలం ఇప్పించాలని తుడుందెబ్బ నాయకులు విన్నవించారు. నాయీ బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆర్డీఓ హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెన్నెల : నెన్నెల జడ్పీ పాఠశాలకు చెందిన అబ్దుల్ రెహమాన్ ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ద్వారా నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. అతడిని ఎమ్మెల్యే గడ్డం వినోద్ సత్కరించారు.

చట్టాలపై అవగాహన అవసరం

చెన్నూరు, న్యూస్‌టుడే: చట్టాలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, చెన్నూరు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి రవి సూచించారు. మంగళవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. విద్యార్థులకు చట్టాల గురించి అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌చందర్‌గిల్డా, ఎస్సై శ్వేత, న్యాయవాదులు రాంబావ్, మహేశ్, రమశ్, పున్నం, రాజేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసాన్ని కలగజేస్తాయని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మడావి గంగారాం అన్నారు. పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపులే బాలుర గురుకులంలో మంగళవారం నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఏటీడీవో పురుషోత్తం, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బండ జీవరత్నం, ప్రధానోపాధ్యాయులు రమేష్ చందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యంతో కార్మికులకు అన్యాయం

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణిలో రాజకీయ జోక్యం పెరుగడంతో కార్మికులకు అన్యాయం జరుగుతుదని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ కేంద్ర ఉపాధ్యక్షుడు అశోక్ పేర్కొన్నారు. మంగళవారం మాట్లాడుతూ సంస్థ సాధించిన లాభాల నుంచి అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ఆర్థిక ప్రణాళికలకు నిధుల కేటాయింపు తర్వాతే నికర లాభాలను ప్రకటిస్తుందన్నారు. 2023-24లో రూ.4,701 కోట్లు సాధించినట్లు పేర్కొన్న యాజమాన్యం అందులోంచి 33 శాతం వాటా చెల్లించకుండా రాజకీయ జోక్యంతో మోసం చేసిందని తెలిపారు. అభివృద్ధి పేరుతో రూ.2,412 కోట్లు ఆర్జిత లాభాల నుంచి మినహాయించడం అన్యాయమన్నారు.

టింబర్ యార్డు కార్మికుల కోసం పోరాటం

శ్రీరాంపూర్ గ్రామీణం: ఆర్థికంగా నష్టపోతున్న టింబర్‌యార్డు కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని సింగరేణి కోల్‌మైనర్స్ అండ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు పేర్కొన్నారు. ఏరియాలోని టింబర్‌యార్డు వద్ద మాట్లాడుతూ గుర్తింపు సంఘాల వైఫల్యంతో కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు.

వాస్తవ లాభాల వాటా ప్రకటించాలి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: సింగరేణి గడించిన వాస్తవ లాభాల వాటాను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మందమర్రి మార్కెట్‌లో తెబొగకాసం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నినాదాలు చేశారు. సంపత్, జె. రవిందర్, ఓ. రాజశేఖర్ ఉన్నారు.

శ్రీరాంపూర్ గ్రామీణం: సింగరేణి సాధించిన లాభాలు రూ.4701 కోట్లలో 33 శాతం కార్మికులకు వాటా చెల్లించాలని భారాస రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం నస్పూర్‌లోని జాతీయ రహదారిపై తెబొగకాసం, భారాస నాయకులు రాస్తారోకో నిర్వహించారు. తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, సత్తయ్య పాల్గొన్నారు.



మందమర్రిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న తెబొగకాసం నాయకులు

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

మందమర్రి పట్టణం, శ్రీరాంపూర్ గ్రామీణం : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని మందమర్రి జీఎం దేవేందర్ అన్నారు. మంగళవారం మందమర్రి వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. సీసీసీ టౌన్‌షిప్‌లోని మైదానంలో చెత్త, వ్యర్థాలను సిబ్బందితో కలిసి శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి తొలగించారు.

నేడు కూరగాయల మార్కెట్ ప్రారంభం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి కూరగాయల మార్కెట్‌ను బుధవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించనున్నారు. పట్టణంలోని కాంటాచౌరస్తాలో పాత మార్కెట్ ఏరియాలో రూ.7.53 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టారు. ఒక్కో స్టాల్‌కు రూ.10 వేలు డిపాజిట్‌గా నిర్ణయించారు. 108 మందికి 75 మంది డిపాజిట్ ఇప్పటికే చెల్లించారు. మొదట డిపాజిట్ చెల్లించిన వారి పేర్లను మళ్లీ డ్రా తీసి స్టాల్స్‌ను కేటాయిస్తారు. ప్రారంభం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

చెన్నూరులో కొనసాగుతున్న కుమ్మరికుంట సర్వే

చెన్నూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని కుమ్మరికుంట చెరువు హద్దుల ఏర్పాటు సర్వే కొనసాగుతోంది. రెండోరోజైన మంగళవారం కూడా రెవెన్యూ, నీటిపారుదలశాఖల అధికారులు చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పూర్తిస్థాయిలో హద్దుల ఏర్పాటు కోసం మరో రెండు రోజుల సమయం పట్టవచ్చని నీటిపారుదలశాఖ డీఈ వేణుగోపాల్, తహసీల్దారు మల్లికార్జున్ తెలిపారు. సర్వేలో రెవెన్యూ జిల్లా సర్వేయర్ శ్రీనివాస్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు. పరిసర ప్రాంత ప్రజలు వారి వెంటే ఉంటూ తమ భూములు ఎక్కడ చెరువు పరిధిలోకి వస్తాయోనని ఆందోళనకు గురవుతుండటం కనిపించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ

హాజీపూర్, న్యూస్‌టుడే: మండలంలోని ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలలతోపాటు గుడిపేటలోని మహాత్మాజ్యోతి బాపులే గురుకుల విద్యాలయాల్లోని మధ్యాహ్న భోజనం తీరును మంగళవారం మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లోని స్టోర్‌రూంలను, బియ్యం బస్తాలను పరిశీలించారు. జ్యోతిబాపులే పాఠశాలలో వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బందిని మందలించారు.

ఐటీఐలో నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

నస్పూర్, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన సీట్లకు 5వ దశ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం వాక్-ఇన్-స్పాట్ ఈ నెల 25 నుంచి 28 వరకు జరుగుతాయన్నారు. అభ్యర్థులు కళాశాలలో ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ ధరఖాస్తు పత్రంతోపాటు నిజధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.



వెండి పతకం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్ పోటీలకు మంచిర్యాల ఆదర్శ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ నాగవర్మ, పీడీ సుదీప్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. లక్షెట్టిపేట బీసీ గురుకులంలో జరిగిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ అండర్-19 వాలీబాల్ బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కె.అశ్విత(ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం), ఎస్.లావణ్య(ఎంపీసీ, ప్రథమ సంవత్సరం), కె.దీపిక(ఎంపీసీ, ప్రథమ సంవత్సరం) రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

లక్షెట్టిపేట: ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 10వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపులే బాలుర గురుకులం విద్యార్థి బి.విష్ణు ప్రతిభ కనబర్చి వెండిపతకం సాధించినట్టు ప్రిన్సిపల్ రోనాల్డ్ కిరణ్ తెలిపారు. అతడిని విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించినట్టు చెప్పారు.

జీవనోపాధి కోల్పోతున్నాం

భీమారం, న్యూస్‌టుడే: నిరుపేదల కుటుంబాలకు జీవనోపాధి లేకుండా పోతుందని మండల కేంద్రంలోని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏళ్లుగా మండల కేంద్రంలోని జాతీయ రహదారి, ఊర చెరువుల పక్కన చిన్న చిన్న టేలాల ద్వారా సుమారు 42 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయన్నారు. సోమవారం రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఊర చెరువు ఆక్రమణల తొలగింపు నోటీసులతో టేలాలలో వ్యాపారాలు నిర్వహించే వారిలో తీవ్ర ఆందోళనలు మొదలయ్యాయన్నారు. కొత్త సత్తిరెడ్డి, బబ్లూ, సతీష్, వెంకటేష్, కొమురయ్య, రాజబాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చి వేయాలి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి మార్కెట్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలంటూ బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం పుర కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. గతంలో సింగరేణికి సంబంధించిన భవనాలను నామమాత్రపు అద్దెతో వ్యాపారులకు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం వాటిలో బహుళ అంతస్తులు కడుతున్నారని పేర్కొన్నారు.

ఆలయంలో పూజలు

మందమర్రి పట్టణం: తిరుమలలో లడ్డూ అపవిత్రం చేసేందుకు ప్రేరేపించిన వైసీపీ చర్యలను వ్యతిరేకిస్తూ మంగళవారం మందమర్రిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకుడు మాయ రమేష్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రాయశ్చిత పూజలు నిర్వహించారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడంపై మందమర్రిలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ ఈ నెల 28న పాదయాత్ర చేపట్టనున్నట్లు వివరించారు.